## రద్దీ ప్రదేశాలే టార్గెట్..

- నకిరేకల్‌లో మొబైల్ దొంగల ముఠా అరెస్ట్
- 50 సెల్‌ఫోన్లు స్వాధీనం

నకిరేకల్ : వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, పక్కన సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ, లచ్చిరెడ్డి

నకిరేకల్, ఆగస్టు 16 : రద్దీ ప్రదేశాలే టార్గెట్‌గా మొబైల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు దొంగల నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిరేకల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పా టు చేసిన విలేక రుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి నిందితుల వివరాలు వెల్లడించారు. కర్నూల్ జిల్లా డోన్ మండలానికి చెందిన నిందితులు దుర్గా ప్రసాద్, రవికుమార్, ప్రభాస్, వెంకటేశ్ ఇద్దరు బాలనేరస్తుల సాయంతో నకిరేకల్, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, జగ్గయ్యపేట తదితర పట్టణాలలో సంతల వద్ద, బస్టాండ్ వంటి రద్దీ ప్రదేశాల్లో మొబైల్స్‌ను దొంగిలిస్తుంటారు. ఎత్తుకెళ్లిన మొబైల్స్‌ను హైదరాబాద్‌లోని విక్రయిస్తారు. బాల నేరస్తులకు కొంత డబ్బు ఇచ్చి మిగిలినదంతా నలుగురు నిందితులు పంచుకుంటారు. ఈ క్రమంలో నకిరేకల్‌లో రాత్రి 10.45 గంటలకు పట్టణానికి చెందిన కోలా సైదులు టిఫిన్ బండి నడుపుతుంటాడు. సైదులు ఇంటికి వెళ్తుండగా మూసీరోడ్డులోని మమత హాస్పిటల్ సమీపంలోకి రాగానే నంబర్ ప్లేటు లేని ఎర్టీగా కారు వచ్చి విలువైన వస్తువులు ఇవ్వాలని బెదిరించి జేబులో ఉన్న ఫోన్, నగదు రూ.2,200 ఎతుకెళ్లారు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ నిందితులను వెతుకుతున్నారు.

క్రమంలో శుక్రవారం పట్టణంలోని బాబన్‌సాహెబ్‌గూడెం స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు నంబర్ ప్లేటు లేని కారు వస్తుండగా అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న ఆరుగురు నేరస్తులను పట్టుకుని వారిని నుంచి 50 సెల్‌ఫోన్లు, కారు, స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును చేధించిన సీఐ రాజశేఖర్ బృందాన్ని డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు. సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ, లచ్చిరెడ్డి, ఏఎస్ఐ కృష్ణాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఐరిష్ బయోమెట్రిక్

కలెక్టరేట్‌లో ఐరిష్ బయోమెట్రిక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 16 : సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో ఐరిష్ బయోమెట్రిక్ (ముఖ గుర్తింపు ద్వారా హాజరు) పరికరాన్ని శుక్రవారం ఏర్పాటు చేసి పనిచేసే విధానాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ సిబ్బంది మొత్తం ప్రతిరోజు ఐరిష్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, ఉద్యోగులు ఉన్నారు.

## భార్యను హతమార్చిన భర్త అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్, ఆగస్టు 16 : ఇటీవల భార్య మెడకు జే వైర్ చుట్టి హత్య చేసిన కేసులో నిందితుడైన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సమావేశంలో ఎస్ఐ బి.కుశలవ్, ఎం.లింగయ్య, శంకర్, సిబ్బంది ఉన్నారు.

## ఆయిల్ పామ్ తోటలను సాగు చేయాలి : ఏఈఓ

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఈఓ ముత్తయ్య

సూర్యాపేట రూరల్, ఆగస్టు 16 : ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా వృద్ధి చెందవచ్చని వ్యవసాయ విస్తరణాధికారి ముత్తయ్య అన్నారు. మండల పరిధిలోని కేసారం గ్రామ రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ వి.శశికుమార్, క్షేత్ర సహాయకులు యానాల సుధాకర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విష జ్వరాల నుంచి కాపాడాలి : సీపీఎం

బొడ్రాయిబజార్, ఆగస్టు 16 : అంటు వ్యాధులు, విష జ్వరాల బారిన పడుతున్న ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ఆరోపించారు. మల్లు వెంకట నర్సింహారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. వర్షాల కారణంగా టైఫాయిడ్, చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులతో జనం బాధ పడుతున్నారని, ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, ఎల్గూరి గోవింద్, నరసింహారావు, దండ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## పాస్టర్‌పై దాడి అమానుషం : ప్రభాకర్

బొడ్రాయిబజార్, ఆగస్టు 16 : హైదరాబాద్‌లోని గాజులరామారం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ప్రార్థనా మందిరంలో పాస్టర్ దైవ ప్రసాద్‌ను కొందరు యువకులు గురువారం రాత్రి తీవ్రంగా కొట్టి చర్చిని ధ్వంసం చేయడాన్ని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. పోలీసులు వెంటనే దర్యాప్తు నిర్వహించి నిందితులను శిక్షించాలని కోరారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిరుమలగిరి(నాగారం), ఆగస్టు 16 : నాగారం మండలం పేరబోయినగూడెం నంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు. డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు..

## వడదెబ్బతో మహిళ మృతి

నాగారం, ఆగస్టు 16 : మండల పరిధిలోని వర్ధమానుకోటలో వడదెబ్బతో గురువారం మహిళ మృతి చెందినది. ఉడుతల యాదమ్మ(60) రోజు మాదిరిగానే కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చి అకస్మాత్తుగా మృతి చెందినదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సోమ నర్సయ్య

తిరుమలగిరి (నాగారం), ఆగస్టు 16 : నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా ఆవాసం విజయనగర్ కాలనీ ఆంజనేయస్వామి గుడి వద్ద 365బీ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో శుక్రవారం వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి పరిధిలోని తొండ గ్రామానికి చెందిన వేల్పుల సోమనర్సయ్య(46) సూర్యాపేటలో నివాసముంటున్నాడు. స్వగ్రామంలో శుభ కార్యానికి బైక్‌పై వెళ్లి తిరిగి సూర్యాపేటకు వెళ్తుండగా నాగారం బంగ్లా ఆవాసం విజయనగర్ కాలనీ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో సోమనర్సయ్య తల రోడ్డుకు బలంగా తగిలి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడు ఈటూరు వీఆర్వోగా పని చేసి ప్రస్తుతం బీసీ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ ఐలయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతలపాలెం, ఆగస్టు 16 : కోదాడ పట్టణానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన షేక్ మీరా(32) ఈ నెల 15న చింతలపాలెం మండలంలోని దొండపహాడ్‌లో బైక్ కొనుగోలు చేసేందుకు తన మిత్రుడు వీరబాబుతో కలిసి వచ్చాడు. అనంతరం ఇరువురు పులిచింతల ప్రాజెక్టును సందర్శించి తిరిగి కోదాడకు బయలుదేరారు. ఈ క్రమంలో దొండపహాడ్ శివారులోని మూలమలుపు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడగా మీరా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న వీరబాబుకి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఇరువురిని జగ్గయ్యపేటలోని దవాఖానకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్తుండా మార్గమధ్యంలో మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

## దేవరకొండ సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బాలూనాయక్

సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), ఆగస్టు 16 : దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక నిధులు రూ.11.50కోట్లతో డిండి, నేరేడుగొమ్ము, చందంపేట మండలాల్లో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రూ.3 కోట్లతో డిండి నుంచి రాజీవ్ విగ్రహం నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, నేరేడుగొమ్ములో రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, చందంపేట మండలం చిత్రియాలలో రూ.3కోట్లతో రోడ్డు పనులు, హంక్యతండా నుంచి కోరుట్ల వరకు రూ.2.50 కోట్లతో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. హంక్యతండాకు డబుల్ రోడ్డు మంజూరు కావడంతో గ్రామ మాజీ సర్పంచులు మల్లారెడ్డి, కొర్ర రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు.

### సీఎం సహాయనిధి చెక్కు అందజేత

దేవరకొండ, నేరేడుగొమ్ము మండలాలకు చెందిన 142 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.42లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బాలూనాయక్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్లు జాలెనర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ సిరందాసు కృష్ణయ్య, మాజీఎంపీపీ జాన్‌యాదవ్, సురేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, తేరా సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు ముత్యాల సర్వయ్యయాదవ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి నల్లగొండలో రైతుబడి అగ్రి షో

- ప్రారంభించనున్న మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో రైతుబడి అగ్రి షో కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్

నీలగిరి, ఆగస్టు 16 : జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల ప్రాంగణంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న రైతుబడిఅగ్రి షో శనివారం ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్ నారాయణ రెడ్డి హాజరై ప్రారంభించనున్నట్లు రైతుబడి యూట్యూబ్ చానెల్ నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డి తెలిపారు.. ఈ షోలో సుమారు 200కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి. సాగులో వస్తున్న మార్పులు, ఆధునిక వ్యవసాయం ఎలా చేస్తున్నారో క్షుణంగా షో ద్వారా రైతులకు వివరించనున్నారు. జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు ఇతర ప్రజాప్రతినిధుల తోపాటు రైతులు కూడా పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

## ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలి

- దివ్యాంగుల హక్కుల పోరాట సమితి

హాలియా, ఆగస్టు 16 : హాలియాలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల నాగార్జున సాగర్ నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే వృద్ధులు, ఒంటరి మహిళల పింఛన్ 2,016 నుంచి 4,016 లకు, దివ్యాంగుల పింఛన్ రూ.4,016 నుంచి 6,016 రూపాయలకు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ అమలుచేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇస్తామన్న పింఛన్‌ను వచ్చే నెల నుంచి పెంచి ఇవ్వాలని కోరారు. లేకుంటే వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ

వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న గౌస్‌పాషా

కొండమల్లేపల్లి, ఆగస్టు 16 : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా వాటర్ ఫిల్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కోసం వాటర్ ఫిల్టర్ అందంచడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తడకమళ్ల భిక్షమయ్య, బండి నరేశ్, పెద్ద శెట్టి సత్యానారాయణ, ఎండీ ఆరీఫ్, కార్యదర్శి సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్‌కు స్వాన్ ప్రతిభ పురస్కార్ కృషి

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న స్వాన్ సభ్యులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 16 : నార్కట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్ ను తీర్చిదిద్దేందుకు స్వాన్(స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి) కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు మామిళ్ల సత్తిరెడ్డి పేర్కొన్నారు. 2024 సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సంస్థ తరపున నగదు బహుమతి, షీల్డ్స్ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్వాన్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఇదేం స్వచ్ఛదనం - పచ్చదనం ..!

- పేరుకుపోయిన పారిశుధ్యం
- తొలగించని కంప చెట్లు


కొండమల్లేపల్లి : 9వ వార్డులో ఇండ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు మురుగునీరు

కొండమల్లేపల్లి, ఆగస్టు 16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కాగితాలకే పరిమితమైంది. ఈ నెల 5 నుంచి 9వ వరకు ప్రభుత్వం పల్లెలు, పట్టణాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తాగు నీటి, వాన నీటి హార్వెస్టింగ్, డ్రైనేజీ, మురుగు నీటి నిల్వలు తొలగింపు, వీధి కుక్కల నియంత్రణ, పిచ్చి మొక్కలు తొలగించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అయితే కార్యక్రమం పూర్తయిన లక్షల రూపాయలు ఖర్చు చేసిన అనే హంగూ ఆర్భాటాలే తప్ప ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందాగా మారింది. అధికారులు ఫొటోలకు ఫోజులివ్వడం తప్పా చేసింది ఏమిలేదని ప్రజలు వాపోతున్నారు.

ముఖ్యంగా మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పిచ్చిమొక్కలు, మురుగునీరు, చెత్త చెదారం విచ్చలవిడిగా వేయడంతో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల సందర్శన

మునుగోడు : విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీఈఓ సరిత

మునుగోడు, ఆగస్టు16: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను జిల్లా జీసీఈఓ(జెండర్ ఈక్విటీ కో-ఆర్డినేటర్) సరిత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్ఓకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠశాలలో కల్పించిన సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి వసంత, సిబ్బంది ఉన్నారు.

## పేదలను ఇబ్బందులకు గురి చేస్తే తీవ్ర పరిణామాలు

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

బొడ్రాయిబజార్, ఆగస్టు 16 : పేదలను ఇబ్బందులకు గురి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారు సర్వే నెంబర్-126లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారితో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల నిరసన

మిర్యాలగూడ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు.

మిర్యాలగూడ, ఆగస్టు 16 : గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు వస్తున్న అరకొర జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతాధికారులు తమపై పనిభారాన్ని పెంచుతూ మానసికంగా మనోవేదనకు గురి చేస్తున్నారని అన్నారు. మెమోలు, సస్పెన్షన్లతో కార్యదర్శులను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని ఐలాపురం కార్యదర్శి సంధ్యారాణిపై కొందరు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, భవాని, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.

## సగం మంది రైతులకే రుణమాఫీ : బీఆర్ఎస్

మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తిరుమలగిరి(తుంగతుర్తి), ఆగస్టు 16 : కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ సగం మంది రైతులకు కూడా కాలేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్భాటాలు, మోసాలతో ప్రజలను మభ్యపెట్టి చేసే పాలన ఎంతోకాలం మనుగడ సాగించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

## 26న క్లియోస్పోర్ట్స్‌లో ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్

ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్మా చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 16: ఈనెల 26 నుంచి పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల క్లియోస్పోర్ట్స్ అరెనాలో ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లియోస్పోర్ట్స్ యాజమాన్యం శుక్రవారం తెలిపింది. ఈనెల 25 వరకు వారి స్కూల్ టీమ్స్‌ను నమోదు చేసుకోవాలని తెలిపారు. టోర్నమెంట్ డ్రా 25న సాయంత్రం 4గంటలకు అందరి సమక్షంలో నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నమెంట్ గ్రాస్ గ్రౌండ్‌లో హార్డ్ టెన్నిస్ బాల్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 8896921234 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ట్రస్మా ప్రెసిడెంట్ కె.శ్యాంసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లియో స్పోర్ట్స్ యాజమాన్యం, స్పార్కిల్ స్కూల్ హెజాజ్ హస్మి, ఎస్‌వీ ఇన్ఫోటెక్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

### ఉమ్మడి జిల్లా సెలెక్షన్స్‌కు ఎంపిక

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) వారు స్థానిక హౌసింగ్‌బోర్డు క్లియోస్పోర్ట్స్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-16 సెలెక్షన్స్‌లో క్లియోస్పోర్ట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు క్లియోస్పోర్ట్స్ యాజమాన్యం తెలిపారు. ఎండీ.అఫాన్, జీ.మణికంఠ, ఎ.జయంత్ ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సెలక్ట్ అయి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి హెచ్‌సీఏ సెలెక్షన్స్‌లో పాల్గొంటారని తెలిపారు. సెలెక్ట్ అయిన క్రీడాకారులు హెచ్‌సీఏ ఇంటర్ స్కూల్స్, కాలేజీ వన్‌డే లీగ్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులను బ్యాడ్మింటన్ కోచ్ రామకృష్ణ అభినందించారు.

## అట్రాసిటీ కేసుపై విచారణ

రావులపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ రవి

తిరుమలగిరి (తుంగతుర్తి), ఆగస్టు 16 : ఈ నెల 5న మండల పరిధిలోని మానాపురం గ్రామానికి చెందిన లకావత్ సురేశ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ రవి శుక్రవారం దీనిపై విచారణ చేపట్టారు. సురేశ్ నాలుగేండ్లుగా రావులపల్లి శివారులోని విజయ్‌కుమార్‌కు చెందిన వ్యవసాయ భూమిని కౌలు చేస్తున్నాడు. ఈ భూమిని విజయ్‌కి విక్రయించిన గట్టు సోమయ్య అతడి కుమారుడు శ్రీకాంత్ ఈ నెల 4న వ్యవసాయ భూమి వద్దకు వచ్చి సురేశ్‌ను ఇక్కడ ఎందుకు సాగు చేస్తున్నావ్ అని బెదిరించడమే కాకుండా రాయలేని మాటల్లో దూశించి పత్తి పంటను ధ్వంసం చేశారు. ఈ విషయమై బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ రవి రావులపల్లిలో పర్యటించి కేసు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలను పై అధికారులకు పంపుతామని ఆయన తెలిపారు. ఆయన వెంట తుంగతుర్తి ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది ఉన్నారు.

## ఆర్థిక సాయం

కేతేపల్లి, ఆగస్టు 16 : మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన మూశం శ్రీను, కొండ నర్సింహ, గెగుళ్ల రమేశ్ ఇటీవల మరణించారు. ఇదే గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్ హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. విషయం తెలియడంతో శుక్రవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

## డంపింగ్ యార్డుకు స్థలం కేటాయింపు

మండల కేంద్రంలో డంపింగ్ యార్డుకు స్థలాన్ని పరిలిస్తున్న తాసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి

మద్దిరాల, ఆగస్టు 16 : మండల కేంద్రంలో డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని ఎంపిక చేసినట్లు తాసీల్దార్ అమీన్‌సింగ్ గురువారం తెలిపారు. గతంలో ఉన్న డంపింగ్ యార్డు కేజీబీవీ పాఠశాలకు సమీపంగా ఉండటంతో ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశాలతో మరో స్థలాన్ని పరిశీలించి ఎంపీడీఓ సత్యానారాయణ రెడ్డికి సూచించినట్లు ఆయన చెప్పారు.

## వీఓఏ కాజేసిన డబ్బు ఇప్పించాలని వినతి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గోరెంట్ల సంఘబంధం సభ్యులు

మద్దిరాల, ఆగస్టు 16 : మహిళా సంఘ బంధం సభ్యుల నగదు కాజేసిన గోరెంట్ల-2 వీఓఏపై చర్యలు తీసుకొని తమ డబ్బులు తమకు ఇప్పించాలని గోరెంట్ల మహిళ సంఘ బంధం సభ్యులు శుక్రవారం తాసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ సంఘబంధం-2 నుంచి వీఓఏ రూ.28లక్షలు తీసుకున్నట్లు ఆరోపించారు. దీనిపై గ్రామ సభలో నిలదీస్తే తానే తీసుకున్నట్లు ఒప్పుకొని తిరిగి చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతన్నాడన్నారు. చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |